క్లుప్తంగా

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



తిరువూరు: పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యనందించడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని తిరువూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక రాజుపేటలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత విద్యాబోధన కేంద్రాన్ని జడ్జి బుధవారం ప్రారంభించారు. ఎంఈఓ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి పిల్లలను చదివించడం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో లభ్యమవుతున్న పథకాలను, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లభనేని రవీంద్ర, ఆరోగ్య, వైద్య విభాగ కన్వీనర్ నాగేంద్ర ప్రసాద్, స్థానిక ప్రతినిధులు హరికృష్ణ, పాపారావు, రాంప్రదీప్, సుదర్శన్, సుబానీ, అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు, వాటర్ ఫిల్టర్ వితరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జెడ్పీ బాలికల పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని పి.వనజాక్షి ఆమె పనిచేస్తున్న కొండపల్లి జెడ్పీ పాఠశాలకు రూ.25 వేలు విలువైన 25 కుర్చీలు, పెద్దసైజు ప్లాస్టిక్ మ్యాట్‌లు 5, వాటర్ ఫిల్టర్ బుధవారం అందజేశారు. విద్యార్థులకు, స్టాఫ్‌కు అవసరమైన వస్తువులు అందించిన వనజాక్షి ఉదార స్వభావాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత అభినందించారు. ఉన్నంతలో కొంత సామాజిక సేవలకు వినియోగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీడీ ఎస్కే రిజ్వానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రీజర్ బాక్స్ అందజేత



విస్సన్నపేట: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో మార్చురీకి స్థానిక సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష రూపాయలు విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం అందజేశారు. మార్చురీ రూమ్ వద్ద సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.పావని, డాక్టర్ వెంకటేశ్వరరావుల సమక్షంలో సత్య సాయి సేవా ట్రస్ట్ సభ్యులు ఫ్రీజర్ బాక్స్‌ను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి, సభ్యులు అనుమోలు రాజారావు, బాలసుబ్రహ్మణ్యం(సంతూరు బాలు), కుక్కడపు చక్రధరరావు, అనుమోలు శ్రీలక్ష్మి, నాగుబండి వాసవీనీలిమ, రంగా పావని, నాగుబండి గాయత్రి, పెనుగొండ రాంబాబు, అనుమోలు రాంబాబు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తపూరులో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చాట్రాయి: మండలంలోని చిత్తపూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో కచ్చా డ్రెయిన్ల పూడికతీత, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, బ్లీచింగ్, రోడ్డు పక్కన చెత్త కుప్పల తొలగింపు పనులు చేపట్టారు. పనులను గ్రామ సర్పంచ్ తిరువీధి రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

- సీఐటీయూ నాయకులు
- డిమాండ్స్ డే సందర్భంగా మండల కేంద్రాల్లో నిరసన
- అధికారులకు వినతి పత్రాల అందజేత



మైలవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న స్కీం వర్కర్స్

మైలవరం: కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డేను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మైలవరం సీఐటీయూ కార్యాలయం వద్ద నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 44 లేబర్ చట్టాలను రద్దు చేసిందని, దాని స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాల వలన కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. కనీస వేతనాన్ని రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఆర్వీ పుష్పకుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ శారద, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కార్యదర్శి శేషమ్మ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వీరమ్మ, పద్మ, సరోజినీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

నూజివీడు: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, ఆశా, అంగన్‌వాడీ తదితర వర్కర్లందరికీ నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణకై పిలుపునిచ్చిన డిమాండ్స్ డేలో భాగంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఏ విశ్వనాథశాస్త్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మోదీ ప్రభుత్వం పీఎఫ్ సకాలంలో చెల్లించని యజమానులకు వేసే జరిమానాపై రాయితీ ఇవ్వడం దారుణమన్నారు. గతంలో కనీస జరిమానా ఐదు నుంచి 25 శాతం వరకు విధించేవారని, దానిని మోదీ ప్రభుత్వం ఒకటి నుంచి 5 శాతానికి తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం చర్యలతో కార్మికులకు సమ్మెలు చేసే హక్కు కూడా పోవడమే కాకుండా పనివేళలు పెంచడం, జీతాలు పెంచకపోవడం, నిర్బంధాన్ని తీవ్రతరం చేయడం వంటివి జరుగుతాయని, వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు పాత పింఛన్ స్కీమ్‌ను అమలు చేయాలని, దేశానికే వెన్నుముక అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, దీని రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్, సెక్యూరిటీ తదితర కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

గంపలగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జే వెంకటేశ్వరరావు కోరారు. డిమాండ్స్ డేను పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వినతి పత్రాన్ని డెప్యూటీ తహసీల్దార్ రాధికారాణికి అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి గువ్వల సీతా రామిరెడ్డి, మండల పరిధిలోని ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల మహిళలు, తదితర సంఘాలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

ఆగిరిపల్లి: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి మండల సీఐటీయూ కార్యదర్శి రాజులపాటి చంటి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న కార్మికుల చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి అమలు చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక చోట్ల చిరుద్యోగులను తొలగిస్తున్నారని, అటువంటి చర్యలను వెంటనే నిలుపదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్.కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, పలువురు ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

ముసునూరు: కార్మిక వర్గాలకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని మండల సీఐటీయూ వర్గాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వెలుగు పథకం బుక్ కీపర్లు తదితర కార్మిక వర్గాలు బుధవారం ముసునూరులో ధర్నా నిర్వహించి, డెప్యూటీ తహసీల్దార్ ఎమిలీకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు రాజకుమారి, దుర్గ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కొండపల్లి పారిశ్రామికవాడలో ఆల్ ఇండియా సీఐటీయూ కమిటీ పిలుపు మేరకు డిమాండ్స్ డే నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. స్కీమ్ వర్కర్లుగా ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మహేష్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలన్నారు. లేనిపక్షంలో కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ముఠా వర్కర్లు, ఆటో, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరారు. ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

విస్సన్నపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల నాయకుడు వి.నాగరాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్‌తో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి

ఏ.కొండూరు: ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.పద్మ, దుర్గ, వీరమ్మ, ఉమాదేవి, పి.శ్రావణి, లక్ష్మి, విజయలక్ష్మి, వెంకాయమ్మ, వీఓఏ, ఆశ, స్వీపర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల ధర్నా

తిరువూరు: కేంద్రప్రభుత్వం పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ తిరువూరు బోస్ సెంటర్‌లో అసంఘటిత కార్మికులు ధర్నా చేశారు. కార్మికుల భద్రతకు పటిష్ట చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్పీ భద్రం, ఆకుల రవి పాల్గొన్నారు.

జననేతతో ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో చర్చిస్తున్న అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి



వైఎస్ జగన్‌కు బొకే అందజేస్తున్న తిరుమలరెడ్డి, కుటుంబ సభ్యులు

మైలవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, వెల్వడం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు కుడుముల తిరుమలరెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం తాడేపల్లిలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర తాజా పరిస్థితుల పైన, వైఎస్సార్ సీపీ భవిష్యత్ కార్యాచరణ గురించి వైఎస్ జగన్‌తో చర్చించారు. రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిణామాలను వివరించినట్లు అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌ను తిరుమలరెడ్డి శాలువాతో సత్కరించారు.

బ్లడ్ క్యాన్సర్ నివారణపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బ్లడ్ క్యాన్సర్ నివారణపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్దన్ మాట్లాడుతూ.. వ్యక్తిలోని స్టెమ్‌సెల్ మార్పిడి ద్వారా బ్లడ్ క్యాన్సర్ నివారించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో క్యాన్సర్ రాదన్నారు. క్యాన్సర్ నిర్మూలన పద్ధతులను ప్రజిత్ సుధాకర్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, హెచ్ఓడీ రాజేశ్వరి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎరువుల వ్యాపారులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



మైలవరంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందం



జి.కొండూరులోని విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ రాంకుమార్

మైలవరం: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణదారులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని కర్నూలు జిల్లా ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. మైలవరంలో ఎరువులు, విత్తనాలు విక్రయ దుకాణాలను వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా నియమితులైన వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారుల బృందం గురువారం తనిఖీలు నిర్వహించారు. మైలవరంలోని శ్రీసీతారామా ఫెర్టిలైజర్స్ కంపెనీ, బాలాజీ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లోని రికార్డులు తనిఖీ చేశారు. బిల్లు పుస్తకాలు, రిజిస్టర్‌లు, విత్తన, ఎరువుల నిల్వలు, సంబంధిత ఇన్ వాయిస్‌లు పరిశీలించారు. రిజిస్టర్‌లు అప్‌డేట్ చేయని కారణంగా రూ.14,13,160 విలువ గల సూక్ష్మ పోషకాలు సరకు అమ్మకం నిలుపుదల చేసి రికార్డులు సరిచేయాలని సూచించారు. ప్రతి రోజు స్టాక్ బోర్డులో సరుకు నిల్వకు సంబంధించి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ అధికారుల బృందంలోని సభ్యులు ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లుతో పాటు పోలీస్ అధికారి ఎస్.బాబ్జీ బాలచంద్రరావు, ఏఓ(టెక్నికల్) వాసుదేవ నాయక్, ఏఓ కె.సంధ్యారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదు

జి.కొండూరు: అనుమతులు లేని నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే వ్యాపారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామని కర్నూలు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఇంటర్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మండల పరిధిలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులు, ధరలు, అనుమతులు వంటి అంశాలను పరిశీలించారు. విత్తనాలతో పాటు ఎరువులు, పురుగు మందులు సైతం గుర్తింపు పొందిన కంపెనీలకు చెందినవే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు పట్టణ స్టేషన్ విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.బాబ్జీ బాలచంద్రరావు, మైలవరం టెక్నికల్ వ్యవసాయాధికారి ఆర్.వాసుదేవరావు, ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలి

ఆగిరిపల్లి: మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి పల్లగాని చెన్నారావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎరువులు, పురుగు మందుల డీలర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లందరూ ఈ పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, డీలర్లు, స్టాక్ రిజిస్టర్లు బిల్ బుక్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. నిబంధనలను అతిక్రమించి అధిక ధరకు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని ఏఓ చెన్నారావు తెలిపారు.

కాలం చెల్లిన భవనంలోని దుకాణాల తరలింపు



నూజివీడు: పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో కాలం చెల్లిన భవనంలోని దుకాణాలను హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి బుధవారం ఖాళీ చేయించారు. ఈ భవనాన్ని నిర్మించి 85 ఏళ్లు గడిచిన నేపథ్యంతో భవనమంతా శిథిలావస్థకు చేరింది. దీంతో దీనిలోని దుకాణాలను ఖాళీ చేయమని యజమానులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని నేపథ్యంలో బిల్డింగ్ యజమానులు హైకోర్టులో పిటీషన్ వేశారు. హైకోర్టు విచారణ చేసి పురాతన భవనంలోని దుకాణాలను ఖాళీ చేయించాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ బిల్డింగ్‌లో ఉన్న హోటల్, సెల్‌ఫోన్ షాప్, ఇతర దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఖాళీ చేయించారు.

ఎన్‌సీడీ కార్యక్రమం విజయవంతానికి పిలుపు



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది

నూజివీడు: దేశంలో క్యాన్సర్, డయాబెటిస్, కార్డియోవాస్కులర్ వ్యాధుల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ ఏలూరు జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో, గ్రామాల పరిధిలో కేటాయించిన ప్రతి ఇంటికీ వెళ్లి క్యాన్సర్, డయాబెటిస్ స్క్రీనింగ్‌ను నిర్వహించాలన్నారు.

ఈ స్క్రీనింగ్‌లో వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తిస్తే వారికి సకాలంలో మెరుగైన వైద్య చికిత్సను అందించడానికి వీలవుతుందన్నారు. ఈ శిక్షణలో 197 మంది పాల్గొన్నారు. ఏరియా ఆస్పత్రి దంత శస్త్రచికిత్స వైద్యులు డాక్టర్ దినేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ హెలీనా, డాక్టర్ శ్రీనివాస్ ట్రైనింగ్ ఆఫీసర్లు శిక్షణ ఇచ్చారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి



కాచవరం(ఇబ్రహీంపట్నం): క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి అన్నారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో పాస్టర్ మోగులూరి ఎలీషా సమకూర్చిన రూ.20 వేలు విలువైన నోట్‌బుక్స్, పెన్నులు బుధవారం విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే విద్యార్థులు అన్ని అంశాలపై పట్టుసాధించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాఠశాలలో కల్పించిన ఇర్ఫాన్ పాషాను అభినందించారు. నైతిక విలువలతో కూడిన విద్యతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలని దాత ఎలీషా పేర్కొన్నారు. పాస్టర్ ఎలీషా ఇప్పటి వరకు రూ.70 వేలు విలువైన వస్తువులు పాఠశాలకు సమకూర్చారని హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా కొనియాడారు. ఎంఈఓ పుష్పలత, హెచ్ఎం నాగమల్లేశ్వరి, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 19న తిరువూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. 20న కాణిపాకం చేరుకుని దర్శనానంతరం శ్రీపురం మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అయిన అనంతరం 21వ తేదీ కంచి, తిరుత్తణి మీదుగా శ్రీకాళహస్తి చేరుతుందని చెప్పారు. కాళహస్తీశ్వరస్వామి దర్శనం అనంతరం 22వ తేదీ రాత్రి తిరువూరు చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.2,800 రానుపోను టికెట్ ధర నిర్ణయించామని, ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ సదుపాయం కల్పించామన్నారు. వివరాలకు 98856 61835 నంబరులో సంప్రదించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తిరువూరు: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నివాసగృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిరువూరు పట్టణంలోని పలు వార్డుల్లో సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్ల పరిసరాల్లో ఖాళీ కొబ్బరిబోండాలు, నీటితొట్టెలు, పూలకుండీలలో నీరు లేకుండా చూడాలని, రోజుల తరబడి నిల్వ నీరు ఉంటే దోమలు ప్రబలి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయని ఆరోగ్య కార్యకర్తలు సూచించారు. జ్వరం బారిన పడి రోజుల తరబడి తగ్గకపోతే సమీప వైద్యశాలలో సంప్రదించి చికిత్స పొందాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తమ్మిలేరు కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు

చాట్రాయి: తమ్మిలేరు వాగు కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చిన్నంపేట తమ్మిలేరు వాగు కాజ్‌వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. తమ్మిలేరు వాగు వరదకు కాజ్‌వే కొట్టుకుపోయిందన్నారు. ప్రస్తుతం రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో తాత్కాలికంగా మరమ్మతులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగాకుమారి, ఏఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా ఉద్యోగావకాశం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి పీజీలో కంప్యూటర్ సైన్స్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ కలిగి ఉన్న అభ్యర్థులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12లోగా కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.14,500 వేతనం ఇస్తామని చెప్పారు.

దోమల నివారణకు చర్యలు



విస్సన్నపేట: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్సన్నపేట గ్రామంలో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్ చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి తెలిపారు. స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల వద్ద ఫాగింగ్‌ను సర్పంచ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ హరికృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉప సర్పంచ్ మందపాటి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గద్దల మల్లయ్య, పార్టీ నాయకులు కోటా శ్రీను, సాధుపాటి కోటి, నాగేంద్రరావు, కరీమా, విక్రమ్ పాల్గొన్నారు.